
సాక్షి
అనంతపురం

సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



దార్శనికుడు సంత్ సేవాలాల్

బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. 8లో



టమాట కిలో రూ.22

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.22, కనిష్టం రూ.4.50, సరాసరి రూ.10 పలికింది.



జిల్లా అంతటా ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గడంతో వేకువజామున కొన్ని ప్రాంతాల్లో చలి కనిపించింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

భానుడి భగభగలు

అనంతపురం అగ్రికల్చర్: శీతాకాలం చివర్లో ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం చలిగింతలు పెడుతుంటే మధ్యాహ్నం ఎండలు సుర్రుమంటున్నాయి. జనవరి నెలంతా 28 నుంచి 32 డిగ్రీలతో పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు 10 నుంచి 15 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. అయితే వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 32 నుంచి 37 డిగ్రీల మధ్య నమోదవుతుండగా.. రాత్రి ఉష్ణోగ్రతలు కొన్ని ప్రాంతాల్లో 13 నుంచి 17 డిగ్రీలు, మరికొన్ని ప్రాంతాల్లో 15 నుంచి 20 డిగ్రీల మధ్య కొనసాగుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నట్లు కనిపించినా... రెండు రోజులుగా మళ్లీ తగ్గుముఖం పట్టడంతో వేకువజామున చలి పెరగడం విశేషం. ఇలా ఉదయం చలి, మధ్యాహ్నం ఎండ వేడి కొనసాగుతోంది. మొత్తమ్మీద వేసవి ప్రారంభం కాకమునుపే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. రానున్న మార్చి, ఏప్రిల్, మే నెలలో సెగలు కక్కే మండుటెండలతో జనం ఉక్కిరిబిక్కిరి కావాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

పట్టుగూళ్లు కిలో రూ.745



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు

హిందూపురం: హిందూపురం మార్కెట్‌లో ఆదివారం బైవోల్టిన్ రకం పట్టుగూళ్లు కిలో అత్యధికంగా రూ. 745 పలికాయి. మార్కెట్‌కు 3,291 (60 లాట్లు) కిలోల పట్టుగూళ్లను రైతులు తీసుకొచ్చారు. ఇందులో గరిష్టం రూ.745, కనిష్టం రూ.608, సరాసరి రూ.698 ప్రకారం క్రయవిక్రయాలు సాగాయి. మడకశిర, పెనుకొండ గూళ్లకు అధిక రేట్లు లభించాయి. అత్యధికంగా మడకశిర, పెనుకొండ, కల్యాణదుర్గం ప్రాంతాల నుంచి పట్టుగూళ్లు వస్తున్నాయి.

ఎగరని 'త్రివర్ణం'



గుంతకల్లు రైల్వే స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన భారీ స్తంభం

గుంతకల్లు: స్థానిక రైల్వే జంక్షన్‌కు మకుటాయమానంగా విరాజిల్లుతున్న భారీ త్రివర్ణ పతాకం రెపరెపలు కనిపించడం లేదు. 75 ఏళ్ల స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని గుంతకల్లు రైల్వే స్టేషన్ ఎదుట వంద అడుగుల ఎత్తున భారీ పోల్‌ను ఏర్పాటు చేసి అతి పెద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం దీని నిర్వహణను ఎలక్ట్రికల్, ఆర్‌పీఎఫ్ విభాగం అధికారులకు అప్పగించారు. ఎల్లవేళలా త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా ప్రత్యేక నిధులనూ కేటాయించారు. 15 రోజుల క్రితం వీచిన పెనుగాలులకు త్రివర్ణ పతాకం చిరిగింది. దీంతో దానిని నిర్వహణ అధికారులు తొలగించారు. ఆ స్థానంలో కొత్త త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడంలో నిర్లక్ష్యం వహించారు. దీంతో రైల్వే స్టేషన్ భవనం శోభ సన్నగిల్లినట్లుగా కనిపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని కోరుతున్నారు.

పండుగలా వ్యవసాయం

ఇది వరకు పంట పెట్టుబడుల కోసం రైతులు అప్పులు చేసేవారు. సకాలంలో అప్పు దొరక్కపోతే పంట పెట్టలేకపోయేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందిస్తుండటంతో రైతులు సకాలంలో పంటలు సాగు చేసుకుంటున్నారు. వ్యవసాయం పండుగలా సాగుతోంది.

- వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద ఏటా రూ.13,500
- ఈ నెల 24న తుది విడతగా రూ.2 వేలు చొప్పున రూ.56.60 కోట్లు
- నాలుగో ఏడాది 2.83 లక్షల మంది రైతులకు రూ.382 కోట్ల లబ్ధి
- ఐదో ఏడాదికి వచ్చే మేలో తొలివిడతగా అందనున్న రూ.7,500
- జగన్ సర్కారు పెట్టుబడిసాయంతో సకాలంలో పంటల సాగు



అనంతపురం అగ్రికల్చర్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజాసంకల్ప పాదయాత్రలో రైతులు పడుతున్న కష్టాలు కళ్లారా చూశారు. 2019లో ముఖ్యమంత్రి కాగానే మేనిఫెస్టోలో పొందుపర్చిన నవరత్నాల అమలుకు శ్రీకారం చుట్టారు. అందులో ప్రధానంగా రైతులు సకాలంలో పంటలు సాగు చేసుకోవాలనే సమున్నత ఆశయంతో 'వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్' అనే సంక్షేమ కార్యక్రమాన్ని గడువుకు ముందుగానే 2019 రబీలోనే అమలులోకి తెచ్చారు. ఏటా ప్రతి రైతు కుటుంబానికీ రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నారు. ఖరీఫ్ కోసం మేలో రూ.7,500, రబీ కోసం అక్టోబర్‌లో రూ.4 వేలు, పంట కోతల సమయం అంటే సంక్రాంతి కానుకగా రూ.2 వేలు.. ఇలా మూడు విడతల్లో నేరుగా రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమ చేస్తున్నారు.

నాలుగో ఏడాది రూ.382 కోట్ల 'భరోసా'..

నాలుగో ఏడాదికి సంబంధించి 2022–23 ఖరీఫ్, రబీ సీజన్లకు వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద జిల్లాలోని 31 మండలాల పరిధిలో అర్హత కలిగిన 2.83 లక్షల రైతు కుటుంబాలకు రూ.13,500 చొప్పున రూ.382 కోట్ల వరకు లబ్ధి చేకూర్చారు. 2022 మేలో మొదటి విడతగా రూ.7,500, రెండో విడత కింద గత అక్టోబర్‌లో రూ.4 వేలు చొప్పున పెట్టుబడిసాయం చేశారు. ఇక తుది విడతగా సంక్రాంతికి రూ.2 వేలు చొప్పున అందించాల్సి ఉండగా ... ప్రతి రైతుకూ పీఎం కిసాన్ కోసం ఈ–కేవైసీ తప్పనిసరి చేయడంతో కాస్త ఆలస్యంగా.... ఈ నెల 24న రూ.2 వేలు విడుదల చేయనున్నారు. తుది విడతగా రూ.57 కోట్ల వరకు విడుదల చేస్తున్నారు. దీంతో వరుసగా నాలుగో ఏడాది కూడా విజయవంతంగా రైతుల ఖాతాల్లోకి పెట్టుబడిసాయం జమ చేసి భరోసా కల్పించనున్నారు. కేంద్రంతో సంబంధం లేకుండా కౌలు రైతులు, అటవీభూములు, దేవదాయ భూముల సాగుదారులకు పూర్తి మొత్తం రూ.13,500 రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.

పెట్టుబడికి ఢోకా లేదు



నాకు ఆరు ఎకరాల పొలం ఉంది. వేరుశనగ, మొక్క జొన్న సాగు చేస్తున్నాను. ప్రతి ఏటా ప్రభుత్వం రైతు భరోసా కింద విడతల వారీగా రూ.13,500 ఆర్థికసాయం అందిస్తోంది. ఆ డబ్బును పంట సాగుకు పెట్టుబడిగా వాడుతున్నాను. అప్పు చేయకుండా భరోసా సొమ్మును పెట్టుబడిగా ఉపయోగించడం ఊరట కలిగిస్తోంది.

– వసూరప్ప, రైతు, కనుకూరు, శెట్టూరు మండలం

నియోజకవర్గాల వారీగా వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ ఇలా...

నియోజకవర్గం	రైతు కుటుంబాలు	లబ్ధి (రూ.కోట్లలో)
శింగనమల	52,720	71.17
తాడిపత్రి	31,522	42.56
గుంతకల్లు	29,007	39.16
ఉరవకొండ	49,721	67.12
కళ్యాణదుర్గం	53,032	71.59
రాయదుర్గం	43,502	58.73
రాప్తాడు (3 మండలాలు)	23,317	31.48
అనంతపురం	242	32.67 లక్షలు

ఈ–కేవైసీతో కాస్త ఆలస్యం




పీఎం కిసాన్ సొమ్ము జమ కావాలంటే ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిబంధన పెట్టడంతో.. తుది విడత రైతు భరోసా నెల రోజుల పాటు ఆలస్యమైంది. ఇక 2023–24 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి ఐదో ఏడాది వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కార్యక్రమం వచ్చే మేలో ప్రారంభం కానుంది. ఖరీఫ్ పెట్టుబడి కోసం మే నెలలోమొదటి విడతగా రూ.7,500 ప్రకారం సొమ్ము జమ చేయనున్నారు. సన్న, చిన్నకారు, పేద రైతులకు పెట్టుబడిసాయం అందడం వల్ల సకాలంలో పంటలు సాగు చేసుకుంటున్నారు.

– బి.చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

ముగుస్తున్న కోటా

అనంతపురం కరువు తీరేలా వరుణుడు కరుణించాడు. సమృద్ధిగా వర్షాలు కురిపించడంతో కుంటలు, చెరువులు, ప్రాజెక్టులు నిండాయి. కేటాయింపుల మేర జలాలు సరఫరా కావడం.. భూగర్భజలాలు వృద్ధి చెందడం.. పంటల విస్తీర్ణం పెరగడంతో జిల్లా సస్యశ్యామలంగా మారింది. ప్రస్తుతం జలాశయాల్లో నీటి మట్టం తగ్గుముఖం పడుతున్నందున మరికొద్దిరోజుల్లో నీటి సరఫరా ఆగిపోనుంది.

- జలాశయాల్లో తగ్గిన నీటిమట్టం
- అధికంగా తుంగభద్ర, కృష్ణా జలాలు
- పంటలు, చెరువులకు సమృద్ధిగా నీరు



టీబీ డ్యామ్



హంద్రీ–నీవా కాలువ

అనంతపురం సెంట్రల్ : ఇదివరకు జిల్లాకు తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) మాత్రమే వరద ప్రదాయినిగా ఉండేది. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో హంద్రీ–నీవా ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలు జిల్లాకు వచ్చాయి. ఈ రెండింటి ద్వారా సాగు – తాగు నీటి అవసరాలు తీరేవి. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాలు సమృద్ధిగా రావడం ద్వారా తుంగభద్ర, శ్రీశైలం జలాయశయాలు పలు దఫాలుగా నిండాయి. దీంతో హెచ్చెల్సీ నుంచి అత్యధికంగా 30.532 టీఎంసీలు వచ్చాయి. తుంగభద్ర నుంచి హెచ్చెల్సీకి 32 టీఎంసీల నికర కేటాయింపులు ఉన్నాయి. జలాశయం పూర్తి సామర్థ్యం 145 టీఎంసీలు కాగా పూడిక చేరడం వల్ల 100.855 టీఎంసీలకు తగ్గిపోయింది. పూర్తిసామర్థ్యం ఉన్న సమయంలో జలాశయంలో 145 టీఎంసీల నీటి లభ్యత ఉంటే దామాషా ప్రకారం హెచ్చెల్సీకి 32 టీఎంసీలు వదలాలి. పూడిక కారణంగా సగటున 22 టీఎంసీలు చొప్పున వస్తున్నాయి. మూడేళ్లుగా సమృద్ధిగా వర్షాలు రావడంతో ఆశించినస్థాయి కన్నా ఎక్కువ నీళ్లు వస్తున్నాయి. నికర కేటాయింపులు ముగియడంతో అదనపు కోటా మరో 2 టీఎంసీలు మొత్తం 32 టీఎంసీలకు పైగా ఈ ఏడాది నీళ్లు వచ్చాయి. గత పాతికేళ్లలో అత్యధికంగా ఈఏడాది నీళ్లు వచ్చాయని హెచ్చెల్సీ అధికారులు చెబుతున్నారు. దాదాపు 1.10 లక్షల ఎకరాలకు ప్రత్యక్షంగా సాగునీటిని అందించారు. తాగునీటికి 10 టీఎంసీల వరకు కేటాయించారు. హెచ్చెల్సీ పరిధిలో లోకలైజేషన్ చెరువులను నీటితో నింపారు. ఇప్పటికీ పీఏబీఆర్‌లో 4.98 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 3.39 టీఎంసీలు, చాగల్లులో 1.01 టీఎంసీలు, పెండేకల్లులో 0.18 టీఎంసీల నీటి నిల్వ ఉంది. వేసవిలో తాగునీటికి, సాగులో ఉన్న పంటలకు ఎలాంటి ఢోకా లేదు.

- దాదాపు 20.749 టీఎంసీలు ఇప్పటి వరకు శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీ–నీవాకు వచ్చాయి. 16.989 టీఎంసీలు జిల్లాలోని జీడిపల్లి జలాశయానికి రాగా.. అక్కడి నుంచి ఎత్తిపోతల ద్వారా గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి రిజర్వాయర్లకు వదిలారు. వాటి కింద ఉన్న కాలువలు, చెరువులకు నీటిని సరఫరా చేశారు. జిల్లాలో 44 చెరువులను హంద్రీ–నీవా నీటితో నింపారు. శ్రీశైలం జలాశయ నీటి మట్టం 835 అడుగులకు పడిపోయింది. జలాశయంలో 55 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. ఈ లెక్కన మరో పదిరోజులు(830 అడుగులు) వరకూ హంద్రీ–నీవాకు నీటిని తీసుకునేందుకు అవకాశముంది. తర్వాత నీటి పంపింగ్ నిలుపుదల చేయనున్నారు.

మరో పది రోజులు హంద్రీ–నీవా నీరు

హంద్రీ–నీవా కాలువ ద్వారా మరో పదిరోజుల వరకూ నీరు రావొచ్చు. శ్రీశైలంలో నీటి మట్టం పడిపోయింది. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో నీటిని తీసుకొచ్చాం. జిల్లా అవసరాలను మొత్తం తీర్చాం. చెరువులను నింపడం ద్వారా భూగర్భజలాలు భారీగా అభివృద్ధి చెందాయి.

– దేశేనాయక్, ఎస్ఈ, హంద్రీ–నీవా

నికర కేటాయింపులు పూర్తి

హెచ్చెల్సీ నికర కేటాయింపులు ఇప్పటికే పూర్తయ్యాయి. దామాషా ప్రకారం 28.821 టీఎంసీలు కేటాయించారు. కేసీ కెనాల్ వాటా 2 టీఎంసీలు విడుదలయ్యాయి. ఇప్పటి వరకూ జలాశయం దగ్గర 30.532 టీఎంసీలు విడుదల చేయగా 28.031 టీఎంసీలు జిల్లా సరిహద్దులోకి వచ్చాయి. మరికొద్దిరోజుల్లో హెచ్చెల్సీకి నీటి సరఫరా ఆగిపోనుంది.

– రాజశేఖర్, ఎస్ఈ, హెచ్చెల్సీ

నేడు బుగ్గరామలింగేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బుగ్గరామలింగేశ్వరస్వామి

తాడిపత్రి టౌన్: ప్రసిద్ధ బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 23వరకు స్వామి వారు రోజూ ఒక అలంకారంలో తాడిపత్రి పట్టణ వీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయ ఆవరణంలో క్యూ లైన్ల కోసం బారికేడ్లు, పందిళ్లు, తీర్థ,ప్రసాదాలు తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. 18న మహాశివరాత్రి, 20న స్వామి కల్యాణోత్సవం, రథోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.


సెల్‌ఫోన్ అపహరణ.. వెంబడించిన పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సెల్‌ఫోన్ అపహరణ అంశంలో పోలీసులు సకాలంలో స్పందించడంతో బెంబేత్తిన దొంగ ఫోన్‌తో పాటు ద్విచక్ర వాహనం వదిలేసి పారిపోయాడు. వివరాలు... అనంతపురానికి చెందిన రంజిత్ కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అనంతపురం నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ అగంతకుడు రంజిత్ సెల్‌ఫోన్ లాక్కొని ద్విచక్రవాహనంపై ఉడాయించాడు. విషయాన్ని వెంటనే ఇతరుల ఫోన్ ద్వారా డయల్ 100కు రంజిత్ చేరవేశాడు. సమాచారం అందుకున్న నాల్గో పట్టణ పోలీసులు రంగంలో దిగి అగంతకుడు వెళుతున్న మార్గాన్ని గుర్తించి, వెంబడించారు. పోలీసులు వెంటబడిన విషయాన్ని గమనించిన యువకుడు వెంటనే సెల్‌ఫోన్‌తో పాటు ద్విచక్రవాహనాన్ని వదేసి పారిపోయాడు. వాహనాన్ని, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం సెల్‌ఫోన్‌ను రంజిత్‌కు అప్పగించారు.

జాతీయ స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు అనంత క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఒడిశాలోని భువనేశ్వర్ వేదికగా మార్చిలో జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో ఆరోన్ రోనాల్డిన్హో, రాహుల్ రోహిత్, భానుప్రకాష్, బాలికల విభాగంలో షేక్ హఫీజా ఉన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో వైఎస్సార్ జిల్లా కడపలో జరిగిన రాష్ట్ర స్థాయిలో పోటీల్లో జిల్లా తరఫున జట్టుగా ప్రాతినిథ్యం వహించిన ఆరోన్ రోనాల్డిన్హో, రాహుల్ రోహిత్, భానుప్రకాష్, షేక్ హాఫిజా, గౌతం, మోహన్‌కృష్ణ, భువంత్, అనినాష్ జెకబ్, ప్రకాష్ రన్నరప్‌ను దక్కించుకున్నారు. ఈ క్రమంలో ప్రతిభ కనబరిచిన నలుగురిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శి మేరీ జ్యోతి తెలిపారు.

..అప్పుడే వద్దు



తెలిసీ తెలియని వయసులో కలిగే లైంగిక కోరికలతో పాటు లైంగిక హింస, బాల్య వివాహాలు.. ఆడుకునే అమ్మాయిల్ని అమ్మల్ని చేస్తున్నాయి. చిన్న వయసులోనే గర్భం దాల్చిన అమ్మాయిల్లో, వారికి పుట్టే పిల్లల్లో కొన్ని దీర్ఘకాలిక అనారోగ్యాలు తలెత్తుతున్నాయి. ఫలితంగా ఇద్దరూ జీవితాంతం ఇటు శారీరకంగా, అటు మానసికంగా బాధపడాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యుక్త వయసులో ఉన్న అమ్మాయిలకు లైంగిక విద్య పట్ల పూర్తి అవగాహన కల్పిస్తేనే ఈ సమస్యను అధిగమించవచ్చని సూచిస్తున్నారు.

- ఆందోళన రేపుతున్న టీనేజీ ప్రెగ్నెన్సీలు
- 'అనంత'లో ఏడాదిలోనే 538 మందికి గర్భం
- సత్యసాయి జిల్లాలోనూ ఇదేస్థాయిలో ప్రెగ్నెన్సీలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కొన్ని కుటుంబాల్లో మార్పు రాకపోవడం విస్మయపరుస్తోంది. కూతురు రజస్వల కాగానే పెళ్లి చేస్తే సరిపోతుందని చాలామంది తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు. కాగా కొంతమంది అమ్మాయిలు చదువు, కెరీర్, ఉద్యోగాల్లో స్థిరపడటం, ఆర్థికంగా నిలదొక్కుకోవడం గురించి ఆలోచిస్తూ 26 ఏళ్ల వరకూ వివాహం చేసుకోవడం లేదు.. కానీ గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు కూతురికి పెళ్లిచేస్తే తమ బాధ్యత తీరుతుందని, బరువు తగ్గుతుందని పదహారేళ్లకే కానిచ్చేస్తున్నారు. ఈ కారణంగానే ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీనేజీ ప్రెగ్నెన్సీలు పెరుగుతుండటం ఆందోళన రేపుతోంది. ఇక్కడే కాదు రాయలసీమ జిల్లాల్లోనే చిన్న వయసులో తల్లులవుతున్న వారు చాలా ఎక్కువగా ఉన్నారంటే ఆశ్చర్యంగా కలుగక మానదు.

పదహారేళ్లకే తల్లులుగా..

వివాహ అర్హత వయసే 18 ఏళ్లు ఉండగా పదహారేళ్లకే తల్లులవుతున్న పరిస్థితి చాలా ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గడిచిన 11 మాసాల్లో అనంతపురం జిల్లాలో 105 మంది అమ్మాయిలు 16 ఏళ్ల లోపు వయసులోనే గర్భం దాల్చారు. 18 ఏళ్లలోపు వయసున్న అమ్మాయిల్లో మరో 433 మంది గర్భం దాల్చిన వారిలో ఉన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోనూ 16 ఏళ్లలోపు వయసున్న 63 మంది అమ్మాయిలు తల్లులయ్యారు. 18 ఏళ్లలోపు ఉండి ప్రెగ్నెన్సీ వచ్చిన వారు మరో 283 మంది ఉన్నారు. వీరిలో 95 శాతం మంది గ్రామీణ ప్రాంత అమ్మాయిలే. చదువుకోవాల్సిన వయసులో తల్లిదండ్రులు వారికి మూడుముళ్ల బంధం వేసి వారి కెరీర్‌కు మధ్యలోనే సమాధి కడుతున్నారు.

- రాయలసీమ జిల్లాలో కర్నూలు తర్వాత ఎక్కువగా టీనేజీ ప్రెగ్నెన్సీలు అనంతపురం జిల్లాలో ఉన్నాయి. కొంతమంది అమ్మాయిలు సామాజిక మాధ్యమాలకు ప్రభావితమై అబ్బాయిలతో కలిసి ఇంట్లోనుంచి వెళ్లిపోతున్న పరిస్థితులూ ఉన్నాయి.

టీనేజీ ప్రెగ్నెన్సీ వల్ల నష్టాలు

- మెటర్నల్ మోర్టాలిటీ అంటే కాన్పు సమయంలో తల్లులు మృతి చెందే అవకాశం ఉంది
- నెలలు నిండక ముందే పుట్టే అవకాశం
- స్టిల్ బర్త్ అంటే కడుపులోనే బిడ్డ చనిపోవడం
- శిశువులు బరువు తక్కువగా పుట్టడం
- తీవ్రస్థాయిలో రక్తపోటు
- శిశువులు సరిగా శ్వాస తీసుకోలేకపోవడం

గడిచిన 11 మాసాల్లో రాయలసీమ జిల్లాల్లో టీనేజీ ప్రెగ్నెన్సీలు ఇలా

జిల్లా	18 ఏళ్లలోపు	16 ఏళ్లలోపు
అనంతపురం	433	105
శ్రీ సత్యసాయి	283	63
కర్నూలు	715	108
నంద్యాల	378	71
వైఎస్సార్	254	50
తిరుపతి	435	96
చిత్తూరు	341	68

చర్యలు తీసుకుంటాం

1098.. ఇది చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్. బాల్య వివాహం చేసినట్లు లేదా ఏర్పాట్లు చేస్తున్నట్లు మా దృష్టికి వస్తే వెంటనే సదరు ప్రాంతానికి వెళ్తాం. అమ్మాయిని కేజీబీవీలో చేర్పించి చదివిస్తాం. చట్టపరంగా తల్లిదండ్రులపైనా చర్యలు తీసుకుంటాం. చాలామంది అమ్మాయిలు మొబైల్ ఫోన్‌లు, సామాజిక మాధ్యమాలకు ఆకర్షితులై చిన్న వయసులో అబ్బాయిలతో కలిసి వెళ్లిపోతున్నారు. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోనే ఇలాంటివి జరుగుతున్నాయి.

– శ్రీదేవి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్

క్లుప్తంగా

డీఈఓ బాధ్యతలు స్వీకరణ



డీఈఓ సాయిరాంకు అభినందనలు తెలుపుతున్న కృష్ణయ్య

అనంతపురం: నూతన డీఈఓ ఎం.సాయిరాం ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నెహ్రూ బాల శిక్షా కేంద్రం డైరెక్టర్‌గా ఉన్న సాయిరాంను అనంతపురం డీఈఓగా నియమించిన విషయం విదితమే. ఇది వరకు ఉన్న ఇన్‌చార్జ్ డీఈఓ ఎస్.కృష్ణయ్య నూతన డీఈఓ సాయిరాంను అభినందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనాథ్, ఏపీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వంచన కేసులో నిందితుడి అరెస్ట్

గుత్తి: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లికి చెందిన ఓ యువతిని ప్రేమించి మోసం చేసిన ఘటనలో యశ్వంత్ బాబుని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వివరాలు.. గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన యశ్వంత్ బాబు చెట్నేపల్లికి చెందిన ఓ యువతి గత ఆరేళ్లగా ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం ఆ యువతి పెళ్లి ప్రస్తావన లేవనెత్తడంతో యశ్వంత్ బాబు ముఖం చాటేశాడు. దీంతో యశ్వంత్ బాబుపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదే అంశంపై యశ్వంత్‌బాబుని అరెస్టు చేసి శిక్షించాలంటూ పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం చెట్నేపల్లి గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆదివారం నిందితుడితో పాటు అతని తల్లిదండ్రులు, చెల్లెలుపై కేసు నమోదు చేశారు. ఆదివారం యశ్వంత్‌బాబును అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

బంజారాల దార్శనికుడు.. సంత్ సేవాలాల్

'సాతీ భవానీ (సప్త మాతృకల)' పూజా విధానాలు ఆచరించే బంజారాల జాతికి ఆయనే దార్శనికుడు. తనదైన బోధనలతో బంజారాల మనసు గెలుచుకుని.. వారిని భాషపరంగా ఏకతాటిపైకి తెచ్చి.. ధర్మమార్గంలో నడిచేలా చేశారు. లిపిలేని బంజారాల భాషను ఒక పద్ధతిగా మార్చాడు. లంబాడీ ప్రజలు ఎక్కడున్నా.. ఒకే రకంగా మాట్లాడుకోగలుగుతున్నారంటే దానికి కారణం ఆయనే. మానవాళికి ధర్మమార్గాన్ని అలవాటు చేసేందుకు ఈ భువిపై వెలసిన ఆయనే సంత్ సేవాలాల్ మహరాజ్. కారణజన్ముడిగా బంజారాలు ఆరాధించే సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం.

- భారతదేశంలోనే ఏకైక ఆలయం 'సేవాగఢ్'
- నాడు కొండ గుట్టల ప్రాంతం.. నేడు పుణ్య క్షేత్రం

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి గ్రామ పంచాయతీ సేవాగఢ్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్ 284వ జయంతి ఉత్సవాలు సోమవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకూ ఘనంగా జరగనున్నాయి. తమ ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ పుట్టి, పెరిగిన సేవాగఢ్‌లో జరిగే ఈ ఉత్సవాలకు దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.



సంత్ సేవాలాల్ మహరాజ్ మూలవిరాట్



సందర్భం: సేవాగఢ్‌లో నేటి నుంచి జయంత్యుత్సవాలు

సేవాలాల్ మహరాజ్ ఆలయం

సేవాగఢ్ విశిష్టత..

గుత్తి మండలం చెర్లోపల్లి గ్రామ సమీపంలోని రాంజీనాయక్ తండాలో భీమా నాయక్, ధర్మిణీ బాయి దంపతులకు 1739, ఫిబ్రవరి 15న సేవాలాల్ జన్మించినట్లు చరిత్ర ఆధారాలు చెబుతున్నాయి. తండ్రి భీమానాయక్ ఆ తండాకు పెద్ద దిక్కుగా ఉండేవారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఆయన విశేష కృషి చేసేవారు. గ్రామంలో రచ్చబండపై పంచాయితీలు నిర్వహించి తీర్పులు చెప్పేవారు. అ కట్టనే నేటికీ భీమానాయక్ కట్టగా పిలుస్తుంటారు. ఈ కట్టకు ఎదురుగా ఉన్న బావిలో అక్కమ్మ దేవతలు స్నానం చేసేవారని, దీంతో ఆ బావిని పవిత్ర 'కాళోకుండ్'గా పిలుస్తుంటారు. ఈ బావిలోనే సేవాలాల్ మహరాజ్ అప్పట్లో స్నానం ఆచరించి, తన ఆధ్యాత్మిక బోధనలతో బంజారాల్లో చైతన్యం తీసుకువచ్చినట్లుగా భక్తులు విశ్వసిస్తున్నారు. ఈ కాళోకుండ్ దగ్గరలో దండం మోరో మాత (మారెమ్మ దేవత) గుడి ఉంది. సేవాగఢ్‌లోని సేవాలాల్ మహరాజ్ ఆలయ పరిసరాల్లో రూ.1.2కోట్లతో మారెమ్మ (మాతా జగదాంబ) ఆలయాన్ని నిర్మించారు.

మహిమలతో ధర్మ బోధన..

చిన్నప్పటి నుంచి సేవాలాల్‌లో సేవాగుణం ఉండేది. ఆవులు కాయడానికి వెళ్లేటప్పుడు తల్లి కట్టిచ్చిన సద్దిని తాను తినకుండా ఆకలితో ఉన్నవాళ్లకు పెట్టేవారు. తాను బంకమట్టితో రొట్టెలు చేసుకుని తినేవారు. ఈ మహిమ చూసి అందరూ ఆశ్చర్యపోయేవారు. జాతర్ల సమయంలో జగదాంబ మాతకు జంతుబలిని ఒప్పుకునేవారు కాదు. అమ్మవారి ఆశీర్వాదంతో అన్ని విద్యలూ నేర్చుకుని బంజారాల సేవలో నిమగ్నమైన సేవాలాల్.. జాతిని ఏకతాటిపైకి తీసుకురావడంతో ఎన్నో ఉద్యమాలు చేశారు. ఇందులో ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులు అరికట్టడం, క్షేత్ర ధర్మాన్ని రక్షించడం మొదలైనవి ముఖ్యమైనవి. ఆ రోజుల్లోనే బంజారాల పరువు ప్రతిష్టల గురించి ఊహించి అహింస సిద్ధాంతానికి పునాది వేశారు. సామాన్యుడిగా పుట్టి అసామాన్యుడిగా ఎలా ఎదగాలో ఆచరించి చూపడమే కాదు.. మరెందరికో మార్గదర్శకులయ్యారు.

దేశంలోనే అరుదైన ఆలయం..

దాదాపు పాతిక సంవత్సరాల క్రితం వరకూ సేవాగఢ్ ప్రాంతం నిర్జీవమైన కొండ గుట్టలతో నిండి ఉండేది. చారిత్రక ఆధారాలను పరిశీలించిన అనంతరం రూ. 1కోటి వ్యయంతో అక్కడ సేవాలాల్ ఆలయాన్ని బంజారా నాయకుడు రంజిత్ నాయక్ నిర్మించారు. ఆలయ నిర్మాణానికి బంజారాలను ఏకం చేసి విరాళాలు సేకరించారు. అప్పటి నుంచి ఈ ప్రాంతం ఓ పుణ్యక్షేత్రంగా మారిపోయింది. 2000 సంవత్సరంలో మొట్టమొదటి సారి సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అప్పటి నుంచి ఏటా క్రమం తప్పకుండా ఈ ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఉత్సవాల్లో దేశ వ్యాప్తంగా ఉన్న బంజారాలు పాల్గొని మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

నేటి నుంచి జయంత్యుత్సవాలు..

సేవాగఢ్‌లో సోమవారం నుంచి మూడు రోజుల పాటు సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, సంయుక్త కార్యదర్శి అశ్వత్థనాయక్, ప్రధాన కార్యదర్శి రవీంద్రనాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆలయ ఆవరణలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. గుత్తి బస్టాండ్ నుంచి సేవాగఢ్‌కు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సమావేశంలో సభ్యులు రామచంద్రనాయక్, శేఖర్‌నాయక్, సుబ్రమణ్యం నాయక్ పాల్గొన్నారు.

జనసేన పొత్తు వాస్తవం

- బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్



మాట్లాడుతున్న సత్యకుమార్

అనంతపురం టవర్ క్లాక్: రాబోవు ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేసేందుకు బీజేపీతో జనసేన పార్టీ పొత్తు కుదుర్చుకున్నది వాస్తవమని భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ స్పష్టం చేశారు. అనంతపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై చర్చించకుండా వ్యక్తిగత ఆరోపణలతో కాలాన్ని వృథా చేసుకుంటున్నారని ప్రతిపక్ష పార్టీలకు హితవు పలికారు. ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. దొంగ ఓట్లు చేర్చినట్లు తమ వద్ద ఆధారాలున్నాయని, వీటిని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణలో ఒంటరిగానే పోటీ చేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు అంకాల్‌రెడ్డి, నాయకులు దుద్దకుంట వెంకటేశ్వరరెడ్డి, సోమయ్య, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ ఉద్యోగాల పరీక్షలకు సర్వం సిద్ధం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఈనెల 19న జరగనున్న ఎస్‌ఐ ఉద్యోగాల ప్రాథమిక పరీక్షల నిర్వహణకు కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ఆదివారం అనంతపురం డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు నగరంలోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఆయా పరీక్షా కేంద్రాలకు వెళ్లి ఏర్పాట్లపై కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడారు. డీఎస్పీతో పాటు సీఐలు రవిశంకర్ రెడ్డి, కత్తి శ్రీనివాసులు, శివరాముడు, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

రగ్బీ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

హిందూపురం: ఈ నెల 19వ తేదీ నుంచి ప్రకాశం జిల్లా మార్కాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం జిల్లా బాల, బాలికల జట్లను ఆదివారం హిందూపురంలో నిర్వహించారు. బాలుర జట్టులో అఖిల్, చరణ్‌తేజ్, సునీల్, చైతన్యకుమార్, సంతోష్, భానుతేజ, వరుణ్, దేవదత్త, ఉదయ్‌కిరణ్, మహేష్, హర్షవర్ధన్, బాలికల జట్టులో అఖిల, ప్రేమశ్రీ, సరస్వతి, నిహారిక, ప్రత్యూష, లైత్య, ప్రియ, సాయికృప, దేవి, యశ్వంతి, యమున, ఇందు, చైతన్య, కీర్తి చోటు దక్కించుకున్నారు. కోచ్‌లుగా కుమారి, రూపవతి, విష్ణువర్ధన్, మల్లికార్జున ఎంపికయ్యారు. ఈ మేరకు రగ్బీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, కార్యదర్శి యాసిన్ మాలిక్ తెలిపారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓటర్లు 1,277

- ముసాయిదా జాబితా విడుదల
- 18 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 22న తుది జాబితా ప్రకటన



ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తున్న డీఆర్వో గాయత్రీదేవి

అనంతపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 1,277 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం ముసాయిదా ఓటర్ల జాబితాను డీఆర్వో గాయత్రీదేవి ఆదివారం తన చాంబర్‌లో విడుదల చేశారు. స్థానిక సంస్థల్లో నగర పాలక సంస్థ కార్పొరేటర్లు, మునిసిపల్ కౌన్సిలర్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఓటర్లుగా ఉంటారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను ఈ నెల 18 వరకు స్వీకరిస్తారు. తుది ఓటర్ల జాబితాను ఈ నెల 22న ప్రకటిస్తారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఈ నెల 16న ఎన్నికల నోటిఫికేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విడుదల చేస్తారు. అదే రోజు నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. నామినేషన్ దాఖలుకు ఈ నెల 23 ఆఖరు. 24వ తేదీన నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియ నిర్వహిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 27వ తేదీ ఆఖరు. మార్చి 13న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. 16న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓటర్లు ఇలా..

రెవెన్యూ డివిజన్	ఓటర్ల సంఖ్య
అనంతపురం	274
గుంతకల్	182
కళ్యాణదుర్గం	218
పెనుకొండ	256
ధర్మవరం	131
పుట్టపర్తి	104
కదిరి	112
మొత్తం	1,277

రైతులను ప్రోత్సహించేందుకే పోటీలు

- ప్రభుత్వ విద్యా సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి



రాతిదూలం లాగుడు పోటీలు ప్రారంభిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

గార్లదిన్నె: రైతులను ప్రోత్సహించేందుకే గ్రామీణ క్రీడలకు పట్టుకొమ్మగా ఉన్న వృషభాల బలప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విద్యా సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. గార్లదిన్నె మండలం కల్లూరులోని క్షేత్రపాల కొండల్లో వెలసిన సింగరప్పతిరునాల ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో న్యూ కేటగిరి ఎద్దులకు రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఆలూరు సాంబశివారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. వివిధ ప్రాంతాలకు చెందిన 13 జతల వృషభాలను పోటీలకు రైతులు తీసుకువచ్చారు. ఒక్కో జతకు 20 నిమిషాలు కేటాయించగా.. నంద్యాలకు చెందిన కేశవరెడ్డి వృషభాలు రాతిదూలాన్ని 5742.6 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. ద్వితీయ స్థానాన్ని గుత్తి మండలం వన్నేదొడ్డికి చెందిన రైతు మద్దిలేటి వృషభాలు, కర్నూలు జిల్లా ఓర్వకల్లు రైతు వెంకటేశ్వర్లు వృషభాలు దక్కించుకున్నాయి. అలాగే మూడో స్థానంలో నంద్యాల జిల్లా సంజామల రైతు చెన్నారెడ్డి వృషభాలు, నాల్గో స్థానంలో గుత్తి మండలం ఊబిచెర్లకు చెందిన రైతు గోవిందు వృషభాలు, నంద్యాల జిల్లా కొత్తపల్లి రైతు దుబ్బన్న వృషభాలు, ఐదో స్థానంలో పెద్దవడుగూరు మండలం మేడిమాకులపల్లి రైతు తిరుపాల్‌రెడ్డి వృషభాలు, ఆరో స్థానంలో గుత్తి మండలం జక్కలచెరువు రైతు గోపాల్ వృషభాలు, ఏడో స్థానంలో సోములదొడ్డి రైతు వీరశేషారెడ్డి వృషభాలు, ఎనిమిదో స్థానంలో సోమనపల్లె రైతు ప్రసాద నాయుడు వృషభాలు, కర్నూలు జిల్లా పుచ్చకాయలమాడ రైతు చంద్ర వృషభాలు నిలిచాయి. విజేతలకు నగదు పురస్కారాలతో గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు పిల్లల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జై జవాన్.. జై కిసాన్



ఆర్మీలో విధులు నిర్వర్తిస్తున్న గొర్ల సుదర్శనరెడ్డి (ఫైల్)



సుదర్శనరెడ్డి సాగు చేస్తున్న శ్రీగంధం చెట్లు

దేశ రక్షణకు జవాన్ ఎంత అవసరమో... ఆ దేశంలో ఉన్న ప్రజల ఆకలి తీర్చడంలో కిసాన్ (రైతు) అంతే ప్రధానం. అంతటి ప్రాధాన్యత ఉన్న ఈ రెండు రంగాల్లోనూ రాణించారు గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు. అత్యాధునిక ఆయుధాన్ని చేతబట్టి సరిహద్దులో శత్రు మూకల చర్యలను సమర్థవంతంగా ఎదుర్కొన్న చేతులతోనే పంటల సాగు చేపట్టి ఆదర్శ రైతుగా రాణిస్తున్నారు. మట్టి వాసన.. విలువ తెలిసిన వ్యక్తి కావడంతో సిరులు కురిపించే పంట దిగుబడులు సాధిస్తున్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో జవాన్ నుంచి కిసాన్ వరకూ గొర్ల సుదర్శనరెడ్డి సాగించిన ప్రస్థానం 'ఆయన' మాటల్లోనే....

\- రాప్తాడు:

- దేశ రక్షణలో 17 ఏళ్ల పాటు సేవలు
- ఉద్యోగ విరమణ తర్వాత సేద్యం
- ఆదర్శంగా నిలుస్తున్న గొర్ల సుదర్శనరెడ్డి

మాది రాప్తాడు మండలం యర్రగుంట గ్రామం. సాధారణ రైతు కుటుంబం. అమ్మ కృష్ణమ్మ, నాన్న లక్ష్మీనారాయణరెడ్డి వ్యవసాయ పనులతో మమ్మల్ని పోషించారు. ఇంటికి పెద్ద కొడుకును నేనే. ఓ చెల్లెలు (లక్ష్మీదేవి) ఉంది. 1 నుంచి 5వ తరగతి వరకూ యర్రగుంటలో, 6 నుంచి పదో తరగతి వరకూ గాండ్లపర్తిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుకున్నా. అప్పట్లో ఐదు కిలోమీటర్లు నడుచుకుంటూ బడికెళ్లేవాళ్లం. ఆ తర్వాత ఇంటర్ విద్యను అనంతపురంలో పూర్తి చేశాను.

సైనికులను చూసి స్ఫూర్తి..

మా ఊరికి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు చాలా మంది భారత సైన్యంలో పనిచేసేవారున్నారు. నా చిన్నప్పుడు వారిని చూసి నేను కూడా సైనికుడిలా మారాలనుకున్నాను. పట్టుదలతో 2003లో ఆర్మీకి సెలెక్ట్ అయ్యాను. అప్పటికి నా వయస్సు 18 ఏళ్లు. నాసిక్‌లో శిక్షణ పొందిన తర్వాత ఆర్టిలరీ విభాగంలో పంజాబ్‌లోని భటిండా కంటోన్మెంట్‌లో విధుల్లో చేరాను. ఆ తర్వాత రాజస్తాన్, జమ్ముకాశ్మీర్, మధ్యప్రదేశ్, సిక్కిం, కార్గిల్, హైదరాబాద్ ప్రాంతాల్లో పనిచేశాను. సరిహద్దులో పనిచేసేటప్పుడు శత్రు సైన్యాల కదలికలు, ఉగ్రవాదుల చర్యలను సమర్థవంతంగా తిప్పిగొట్టడంలో మా బృందం ప్రదర్శించిన ధైర్యసాహసాలు మాటల్లో చెప్పలేను. 2011లో బత్తలపల్లి మండలం అప్పరాచెరువు గ్రామానికి చెందిన సురేఖతో వివాహమైంది. మాకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2020లో నాయక్ కేడర్‌లో ఉద్యోగ విరమణ పొందాను.

పంటల సాగులో రాణింపు..

వ్యవసాయమనేది మా నెత్తురులోనే ఉంది. 17 ఏళ్ల పాటు సైనికుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన నేను ఇతర ఉద్యోగాల కోసం వెంపర్లాడకుండా వ్యవసాయంపై దృష్టి సారించాను.మాకున్న ఏడు ఎకరాల్లో నాన్న తన శక్తి కొద్ది మూడు ఎకరాల్లో మామిడి సాగు చేపట్టారు. మిగిలిన నాలుగు ఎకరాలను బీడుగా వదిలేశారు. నేను వచ్చిన తర్వాత నాన్నకు కాస్త విశ్రాంతినిస్తూ మామిడి తోటతో పాటు బీడుగా ఉన్న నాలుగు ఎకరాల్లో 700 చీనీ మొక్కలు నాటాను. మామిడి తోటలో అంతర్ సాగుగా 500 శ్రీగంధం, 500 ఎర్రచందనం మొక్కలు నాటాను. ఎంతైనా మట్టి విలువ తెలిసిన వాడ్ని కాబట్టి సేంద్రియ ఎరువులతోనే పంటల సాగు చేపట్టి భూసారాన్ని కాపాడుకుంటున్నా. ప్రస్తుతం రైతుగా ప్రజల ఆకలి తీర్చడంపైనే దృష్టి పెట్టాను. ఎప్పుడైనా దేశానికి నా సేవలు అవసరమైతే మళ్లీ ఆయుధం పట్టేందుకు సిద్ధంగా ఉన్నాను.

'వన్ ర్యాంక్ వన్ పెన్షన్'తో అన్యాయం

- ఇండియన్ వెటరన్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెప్టెన్ షేకన్న



చర్చావేదికలో పాల్గొన్న మాజీ సైనికుల సంఘం నేతలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కేంద్ర ప్రభుత్వం అమలు పరిచిన వన్ ర్యాంక్ వన్ పెన్షన్ విధానం నిరాశాజనకంగా ఉందని ఇండియన్ వెటరన్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెప్టెన్ షేకన్న అన్నారు. అనంతపురంలోని మాజీ సైనికుల కార్యాలయంలో వన్ ర్యాంక్ వన్ పెన్షన్‌పై ఆదివారం నిర్వహించిన చర్చా వేదికలో ఆయన మాట్లాడారు. నూతన పెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పుడు మాజీ సైనికులకు పెన్షన్ భారీగా పెరుగుతుందని ఆశించామన్నారు. అయితే నామమాత్రంగా పెన్షన్ పెరగడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో నాయక్ సుబేదార్ నుంచి హానరరీ కెప్టెన్ వరకూ గల ర్యాంకుల వారికి తీరని అన్యాయం జరిగిందన్నారు. వారికి ఇప్పుడిస్తున్న పెన్షన్‌ను రూ.2 వేలకు తగ్గించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సైనికులతో పాటు సైన్యంలో పనిచేస్తున్న 13 లక్షల మందిపై దీని ప్రభావం పడుతుందన్నారు. మాజీ సైనికులకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఈ నెల 20న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన భారీ ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీకి రాలేని వారు ఈ నెల 20న కలెక్టర్‌తో సమావేశమై ప్రధానమంత్రికి, డిఫెన్స్ మినిస్టర్‌కు వినతి పత్రాలను పంపాలని సూచించారు. చర్చావేదికలో అనంతపురం జిల్లా మాజీ సైనికుల సంఘం ప్రధాన కార్యదర్శి కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు, తిమ్మారెడ్డి, రంగారెడ్డి, బషీర్ అహ్మద్, ఆర్.ఎస్.నాగరాజు, శివశంకర్, అన్వర్ బాషా, బాల నాగరాజు, హుస్సేన్, ఈశ్వరయ్య, మైనుద్దీన్, నరసింహులు, నబీరసూల్, రవికుమార్, ప్రసాద్, మణికుమార్, బాలస్వామి, శ్రీనివాసులు, ఇర్షాద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కౌన్సిల్‌మీట్, స్పందన రద్దు

అనంతపురం క్రైం: ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలులో ఉండడంతో ఈ నెల 13న జరగాల్సిన కౌన్సిల్‌మీట్, బడ్జెట్ సమావేశం వాయిదా వేస్తున్నట్లు నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమం ఎన్నికల కోడ్ ముగిసే వరకూ ఉండదని తెలిపారు.

కులవివక్ష నిర్మూలనకు కృషి చేయాలి

- కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుద్దు ప్రభాకర్

అనంతపురం టవర్‌క్లాక్: కులవివక్ష నిర్మూలనకు ప్రభుత్వాలు కృషి చేయాలని, దేశంలో కులాలు,మతాల మధ్య బీజేపీ నాయకులు చిచ్చుపెట్టి, రాజకీయ లబ్ధి పొందుతున్నారని కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుద్దు ప్రభాకర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో కుల నిర్మూలన పోరాట సమితి మహాసభలు నిర్వహించారు. దుద్దు ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మతాలను అడ్డు పెట్టుకొని అధికారంలో కొచ్చాక ప్రభుత్వ సంపద ప్రైవేటు, కార్పొరేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందన్నారు. ప్రజలు వీటిని గమనించాలని, లేకపోతే దేశ సంపద తరుగుతుందన్నారు. ఎస్సీ,ఎస్టీలకు సంబంధించిన 27 పథకాలు సక్రమంగా అమలయ్యేలా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ,ఎస్టీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, నల్లప్ప, కృష్ణప్ప, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈత పోటీల్లో తోపుదుర్తి విద్యార్థినికి ద్వితీయ స్థానం



వెండి పతకం అందుకున్న తోపుదుర్తి విద్యార్థిని శ్రీకన్య

ఆత్మకూరు: తోపుదుర్తి ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థిని శ్రీకన్య ఈత పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. పాఠశాల విద్యార్థులు ఐదుగురు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని, రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో తోపుదుర్తికి చెందిన విద్యార్థిని శ్రీకన్య రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. శ్రీకన్యకు రాష్ట్ర స్థాయి నుంచి వెండి పతకం అందించారు. ఈత పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచినందుకు గర్వంగా ఉందని హెచ్ఎం చంద్రశేఖర్ నాయుడు, పీడీ శ్రీవాణి విద్యార్థినిని అభినందించారు.

ఎంపీ రంగయ్యకు వాల్మీకి సంఘాల సన్మానం



ఎంపీ రంగయ్యను సన్మానిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

రాప్తాడు: ఎంపీ తలారి రంగయ్య ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాల్లో సమాజంలో నాటి, నేటి వాల్మీకుల పరిస్థితిపై సునిశితంగా ప్రసంగించడంపై వాల్మీకి సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సమావేశాలు ముగిసిన అనంతరం ఎంపీ తలారి రంగయ్య ఆదివారం అనంతపురం విచ్చేసిన సందర్భంగా వాల్మీకి సంఘాల నాయకులు రాప్తాడు మండలంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజా దగ్గరకు చేరుకొని సన్మానించారు. వాల్మీకి నాయకులు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరించాలని అనేక రూపాల్లో పోరాటాలు చేస్తున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. బ్రిటిష్ పాలనలో ఏవిధంగా ఉన్నాం, తర్వాత స్వార్థ, రాజకీయ కుట్రలతో బీసీ జాబితాలోకి చేర్చిన విధానంపై అనర్గళంగా ప్రసంగించి ఎస్టీలుగా పునరుద్ధరణ చేయాలని పార్లమెంటులో ఎంపీ రంగయ్య కోరడం హర్షణీయమన్నారు. నాయకులు పోగాకు రామచంద్ర, ఈశ్వరయ్య, తిప్పేస్వామి, బందూక మధు, సూరీ, శ్రీధర్, రమణ, ముత్యాలు, అంకె లక్ష్మన్న, పాల్గొన్నారు.

రైతుకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన రైతు సుధీర్‌రెడ్డిని 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం

కనగానపల్లి: పాతపాళ్యం సమీపంలో తగరకుంట రహదారిలో ఆదివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యవసాయ పొలం వద్దకు వెళ్తున్న రైతు సుధీర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు.. రైతు సుధీర్‌రెడ్డి ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పాతపాళ్యం- తగరకుంట రహదారిలో క్రాసింగ్ వద్ద వేగంగా వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. దీనిపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మూలనపడిన హరిత ఆశయం

- నగరంలోని పార్కుల్లో మొక్కలను పడేసిన వైనం
- ప్రజాధనం దుర్వినియోగం
- ఇంజినీర్ల తీరుపై సర్వత్రా విమర్శలు

ప్రభుత్వం అనంతను హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు పటిష్ట చర్యలు తీసుకుంది. ఈ బృహత్తర ఆశయాన్ని అమలు చేయాల్సిన నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు నీరుగారుస్తున్నారు. గతంలోనే రూ.లక్షలు వెచ్చించి మొక్కలు కొనుగోలు చేసి, వృథాగా పడేశారు. కొత్తగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో డివైడర్ల మధ్యన, రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా రూ.61 లక్షలకు టెండర్లను ఆహ్వానించారు. నగరపాలక సంస్థలోని పలువురు ఇంజినీర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రజాధనం దుర్వినియోగమవుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– అనంతపురం క్రైం:



రాజీవ్ చిల్డ్రన్స్ పార్కులో మూలన పడిన మొక్కలు



నగరంలోని రాజీవ్ చిల్డ్రన్స్ పార్కులో వివిధ రకాలకు చెందిన 500 పైగా మొక్కలను వృథాగా పడేశారు. అందులోని మొక్కలు ఎండుముఖం పట్టాయి. రెండో రోడ్డు పార్కులోనూ వందలాది మొక్కలను మూలనపడేశారు. జీసస్ నగర్‌లోని వివేకానంద పార్కులోనూ కొన్ని మొక్కలను నాటకుండా అలానే వదిలేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లలోని డివైడర్ల మధ్య, రోడ్డుకి ఇరువైపులా నాటించే ఆలోచన కూడా చేయకుండా అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు.

పట్టించుకోని ఎన్విరాన్‌మెంట్ డీఈ :

నగరపాలక సంస్థ ఎన్విరాన్‌మెంట్ డీఈ రాంప్రసాద్ రెడ్డి పట్టించుకోవడంలేదు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటించేలా చర్యలు తీసుకోవాల్సిన ఆయన.. నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించిన తెచ్చిన మొక్కలు మూలకుపడినా పట్టించుకోవడంలేదు. గతంలోనే ఈయన అనుమతులు లేకుండా రూ.లక్షలు విలువ చేసే వీల్‌బారర్స్‌ను తెప్పించి విమర్శలపాలయ్యారు.

నగర సుందరీకరణకు రూ.61 లక్షలు :

నగర సుందరీకరణలో భాగంగా నగరపాలక సంస్థ ఇటీవల సాధారణ నిధులు రూ.61 లక్షలతో నగరంలోని జేఎన్‌టీయూ రోడ్డు, స్మార్ట్ సిటీ రోడ్డు, ఎన్‌టీఆర్‌మార్గ్ వద్ద డివైడర్ల మధ్యలో, రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఎన్‌టీఆర్ మార్గ్‌లో 136 ఫోఇనిక్స్ సిల్వెస్ట్రిస్ట్, 3200 గాల్ఫిమా గ్లాకాట్, 150 రోఫ్‌స్టోనియారిజిన్, 1620 ఇక్సోరా చైనెనిస్ట్,1710 ప్లంబాగో అరుక్యూలట, తదితర మొక్కలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మొక్కలు కొనుగోలుకు టెండర్లు పూర్తికాగా, త్వరలో అగ్రిమెంట్ పూర్తికానుంది.

మొక్కలు నాటించేలా చర్యలు

'అనంత'ను హరిత నగరంగా మార్చేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకెళ్తున్నాం. పార్కుల్లో ఉన్న మొక్కలను నాటించేలా చర్యలు తీసుకుంటాం. జేఎన్‌టీయూ రోడ్డు, స్మార్ట్ సిటీ రోడ్డు, ఎన్‌టీఆర్ మార్గ్ ప్రాంతాల్లో మాత్రమే రూ.61 లక్షలతో మొక్కలు, ఏడాది పాటు వాటి నిర్వహణ చేపట్టేలా చర్యలు తీసుకున్నాం.

– కే భాగ్యలక్ష్మి, కమిషనర్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చర్చి పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక

అనంతపురం: నగరంలోని రామచంద్రనగర్‌లోని సెయింట్ అగస్టీన్ (చర్చి స్కూల్) పాఠశాలలో 1989-90 బ్యాచ్ ఏడో తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. వివిధ నగరాల్లో స్థిరపడిన మిత్రులందరూ పాఠశాలలో కలిసి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబ సభ్యులతో పాల్గొని, సంతోషంగా గడిపారు. వారికి విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం చిరకాలం గుర్తుండిపోవాలని ఆకాంక్షించారు.

నేడు శతసహస్ర పార్థివ లింగార్చన

అనంతపురం కల్చరల్: తపోవనం జగదీశ్వరాలయంలో మాఘ సోమవారాన్ని పురస్కరించుకొని జిల్లాలోనే తొలిసారి శత సహస్ర పార్థివ లింగార్చన నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు సాయిట్రస్టు ఆధ్వర్యంలో వందలాది మందితో సాగే ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు విజయ్‌సాయి కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

కాశీవిశ్వేశ్వర విగ్రహ ప్రతిష్ట

చెన్నేకొత్తపల్లి: న్యామద్దల గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశీవిశ్వేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాప్తాడు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీశ్రీ కవితా గానం భావి కవులకు స్ఫూర్తి



మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్

అనంతపురం కల్చరల్: మహాకవి శ్రీశ్రీ రాసిన ప్రతి వాక్యం కవులకు స్ఫూర్తినిచ్చి సరికొత్త కవిత్వానికి పునాదులేసిందని వక్తలు అన్నారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో పలువురు ఔత్సాహిక కవులు ఆలపించిన శ్రీశ్రీ కవితలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో 'రెడ్ బుక్స్ డే' వేడుకలు జరిగాయి. డాక్టర్ హేమమాలిని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ప్రగతి, డాక్టర్ రాధేయ, మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై శ్రీశ్రీ మహాప్రస్థానం గురించి ప్రసంగించారు. కమ్యూనిస్టు ప్రణాళిక ప్రచురితమైన దినాన రెడ్ బుక్స్ డే జరుపుకుంటున్నామని, ఈ సాహిత్యం ద్వారా అభ్యుదయ భావాలను చేరవేయడానికి ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ కథా రచయితలు ఉప్పరపాటి వేంకటేశులు, తరిమెల అమరనాథరెడ్డి, అశ్వర్థరెడ్డి, ప్రజ్ఞాసురేష్, డాక్టర్ అంకె శ్రీనివాస్, యమున, కొత్తపల్లి సురేష్, చం.శాస్త్రి, కసాపురం ఆంజనేయులు, రామిరెడ్డి తదితరులు కవితలు చదివి వినిపించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కత్తి విజయ్‌కుమార్

– జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



కత్తి విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: డాన్సర్‌గా, కరాటే మాస్టర్‌గా, చేయి తిరిగిన చిత్రకారుడిగా, బుల్లితెర దర్శక రచయితగా బహుముఖ ప్రజ్ఞ కనబరిచే కత్తి విజయ్‌కుమార్‌లాంటి వారు అరుదుగా ఉంటారని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. ప్రతిష్టాత్మక వ్యక్తులకు అందించే అనంత ఆణిముత్యం అవార్డు అందుకున్న కత్తి విజయ్‌కుమార్‌ను ఆదివారం స్థానిక వేణుగోపాల్‌నగర్‌లోని డాన్స్‌మాస్టర్ హరిప్రసాద్ లహరి డాన్స్ ఇన్స్టిట్యూట్‌లో కత్తి విజయ్‌కుమార్ ఆత్మీయ అభినందన సభ జరిగింది. జిల్లా డాన్స్‌మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్నం శివప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ప్రముఖ నాట్యాచార్యులు కృష్ణమూర్తి రాజు, షణ్ముఖ నాయుడు తదితరులు కత్తి విజయ్‌కుమార్ స్ఫూర్తిదాయక జీవితంపై మాట్లాడారు. ఆయనకు తమ వంతు సహకారం అందించి భవిష్యత్ తరాల విద్యార్థులు మరింత రాణించేలా చేస్తామన్నారు. అంతకు ముందు జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన డాన్సర్లు, విద్యార్థులు ముఖ్య అతిథులతో కలిసి ఆయన్ను ఘనంగా సన్మానించారు.

శివరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: నగరంలోని అనంత శివారాధన సమితి కార్యాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. అనంత శివారాధన సమితి అధ్యక్షులు గొంగడిరామప్ప, ఉడుపి అనంత పద్మనాభశర్మ, పాలసముద్రం నాగరాజు, యాదవల్లి సుబ్రమణ్యం, కేవీఎస్ చలపతిరెడ్డి, చంద్రశేఖర్, కౌసల్య తదితరులు మాట్లాడారు. స్థానిక మూడోరోడ్డులోని గొంగడి రామప్ప ఫంక్షన్ హాలు వేదికగా సాగే వేడుకల్లో ఈనెల 18న మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 6 గంటలకు మహాగణపతి పూజ, 11 గంటలకు సామూహిక భజనలు, సాయంత్రం 6 గంటల నుంచి జీఆర్ గార్డెన్స్‌లో భక్తిగీతాలాపన, రాత్రి 9 గంటలకు నాట్యాచార్యులు దేవరకొండ కౌసల్య నేతృత్వంలో నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు.

నిధుల కొరత దారుణం

అనంతపురం కల్చరల్: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి నిధుల కొరత రావడం దారుణమని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి అధ్యక్షుడు కేవీ రమణ ఓ ప్రకటనలో మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధిహామీ పథకానికి నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. కోటి మంది కూలీలు పని చేయాల్సిన మన రాష్ట్రంలో కనీసం సగం మందికి కూడా పని కల్పించలేని దుస్థితిలో ఉందన్నారు.

చికిత్స పొందుతూ వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



రాంభూపాల్‌రెడ్డి (ఫైల్)

రాప్తాడురూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాంభూపాల్‌రెడ్డి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. బంధువులు, స్థానికులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలం పాపంపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ రాంభూపాల్‌రెడ్డి రాంభూపాల్‌రెడ్డి భార్య మంజుల (స్టోర్ డీలరు) ఇద్దరూ ఇటీవల బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ కళ్యాణ మంటపంలో జరిగిన బంధువుల వివాహానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా బళ్లారి రోడ్డు (సాయిబాబా గుడివద్ద) వద్ద కారు వేగంగా వచ్చి ఢీకొనింది. ఈ ప్రమాదంలో దంపతులు ఇద్దరూ గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. భార్య మంజుల కోలుకోగా, తీవ్రంగా గాయపడిన భర్త రాంభూపాల్‌రెడ్డిని మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాంభూపాల్‌రెడ్డి మృతిపట్ల ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి సంతాపం తెలియజేశారు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో చేపట్టిన మహాసంకల్ప పాదయాత్ర ప్రారంభం నుంచి ముగిసేవరకూ రాంభూపాల్‌రెడ్డి పాదయాత్రలో నడిచాడు.

'మాంటిస్సోరి'లో ఐఐటీ కోచింగ్ అకాడమీ ప్రారంభం



మాంటిస్సోరి ఎలిట్ పాఠశాలలో ఐఐటీ కోచింగ్ అకాడమీ ప్రారంభిస్తున్న కోటా మేనేజింగ్ రీజనల్ ఆఫీసర్ విజేంద్ర సింగ్ గుర్జర్

రాప్తాడు: దేశంలోనే అగ్రగామి ఐఐటీ శిక్షణ సంస్థ అయిన కెరీర్ పాయింట్ కోట (రాజస్థాన్) వారి పూర్తి అకాడమిక్స్ సహకారంతో అనంతపురంలో మొదటి సారిగా మాంటిస్సోరి ఎలిట్ పాఠశాలలో ఐఐటీ కోచింగ్ అకాడమీ ప్రారంభిస్తున్నట్లు కోటా మేనేజింగ్ రీజనల్ ఆఫీసర్ విజేంద్ర సింగ్ గుర్జర్ తెలిపారు. ఆదివారం మండలంలోని 44వ జాతీయ రహదారి సమీపంలోని గొల్లపల్లి దగ్గర మాంటిస్సోరి ఎలిట్ పాఠశాలలో మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణభరత్ ఆధ్వర్యంలో ఐఐటీ కోచింగ్ అకాడమీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కోటా విద్యా సంస్థ వారి ప్రత్యేక స్టడీ మెటీరియల్, ఎలిట్ యాప్ ద్వారా వీడియోలను పొందే అవకాశం, వీడియోలను విక్షించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు ప్రత్యేక ఏసీ గదులు , వసతి ఉందని రెసిడెన్షియల్ విధానం కూడా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కృష్ణ సమీర, హెచ్ఎం ప్రతాప్ రెడ్డి, ఎలిట్ ఐఐటీ అకడమిక్ డైరెక్టర్ మధు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఇస్తెమాను విజయవంతం చేద్దాం



సమావేశంలో పాల్గొన్న నగర మేయర్ వసీం

అనంతపురం సప్తగిరి సర్కిల్: మార్చి 11, 12 తేదీల్లో అనంతపురం సమీపంలోని ఆటో నగర్‌లో నిర్వహించే ఇస్తెమాను విజయవంతం చేయాలని నగర మేయర్ వసీం పిలుపునిచ్చారు. నగర శివారులోని జియా ఉల్ ఉలూం మదరసాలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ ఇస్తెమాకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 3 లక్షల మంది హాజరవుతున్న నేపథ్యంలో వజూ ఏర్పాట్లు, టెంట్ల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇసాక్, బాబాఫకృద్దీన్, సయ్యద్ జమాల్ సాబ్, కరీం సాబ్, మౌలానా రియాజ్, దావూద్‌సాబ్, అమీర్‌బాషా పాల్గొన్నారు.

వ్యాఘ్ర వాహనంపై విహరించిన విశ్వేశ్వరుడు



విద్యుత్‌దీప కాంతుల నడుమ ఆలయ పరిసరాలు



ఊరేగుతున్న పార్వతీ పరమేశ్వరులు

అనంతపురం కల్చరల్: శ్రీశైల క్షేత్రాన్ని తలపిస్తూ సాగుతున్న కాశీవిశ్వేశ్వరుడి బ్రహ్మోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శివ నామస్మరణతో విద్యుత్ దీప అలంకారంతో శివాలయ పరిసరాలు ఆధ్యాత్మిక భావనను పెంచుతున్నాయి. ఆదివారం ఉదయం దీక్షా హోమాలు, మహాశివుడికి ఏకవార రుద్రాభిషేకాలు, భస్మార్చనలు జరిగాయి. రాత్రి విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరుడు వ్యాఘ్ర వాహనంపై ఊరేగుతూ దర్శనమిచ్చాడు. కళారూపాల ప్రదర్శనలు, భజనలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. మొదటిరోడ్డు మీదుగా రెండు, మూడోరోడ్లలో స్వామి అయ్యప్ప అలంకారంలో ఊరేగుతుండగా, భక్తులు అడుగడుగునా హారతులిచ్చి దర్శనం చేసుకున్నారు. ఆలయంలో సాగిన సాంస్కృతిక సంబరాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో సుధారాణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మార్మోగిన సుబ్రహ్మణ్యేశ్వరుడి నామస్మరణ



ప్రత్యేక పూజలందుకున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నాలుగో ఆదివారం తిరునాల ఘనంగా జరిగింది. సుబ్రహ్మణ్యేశ్వర నామస్మరణతో కోటంక కొండ మార్మోగింది. శనివారం రాత్రి స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ స్వామి సన్నిధికి చేర్చారు. ఆదివారం తెల్లవారుజామున నాగదోష నివారణ హోమం నిర్వహించారు. స్వామిని పల్లకీలో ఊరేగించారు. వీటిని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో జిల్లా నలుమూలల నుంచేగాక చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. 108 సాలగ్రామ శివలింగాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు.అలాగే పుట్ట వద్ద మహిళలు పూజలు చేశారు. సంతానం కాని వారు పూజలు చేస్తే సంతానం కలుగుతారని భక్తుల నమ్మకం. స్వామివారి మూల విరాట్ వద్ద ఉన్న నీటిని భక్తులు బాటిళ్లలో తీసుకొని సేవించారు. ఇలా చేయడం వల్ల సకల రోగాలు నివారణ అవుతాయని ప్రజల నమ్మకం. 35 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి, నాగుల పడగ, నంది రాతి విగ్రహాలు వద్ద భక్తులు సందడి కనిపించింది. ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బిరెడ్డి, సభ్యులు, ఈఓ బాబు ఏర్పాట్లు చేశారు.

పంపనూరులో మాఘమాస పూజలు



రథోత్సవం నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది



ప్రత్యేక అలంకరణలో సర్పరూపుడు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మాఘమాస ఉత్సవాల్లో భాగంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి మాఘస్నానాలు అనంతరం పంచామృతాభిషేకాలు నిర్వహించి, రకరకాల పూలు, పట్టువస్త్రాలు, బంగారు కవచంతో వివిధ రకాల పూజలు చేశారు. స్వామి వారి బంగారు కవచాన్ని మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు చేశారు. భీజాక్షర హోమం, రథోత్సవం నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహామంగళహారతి ఇచ్చారు.

హాయిరే హోయ్.. ఈత కొట్టురోయ్!







చలికాలం పోలేదు.. వేసవి ఇంకా రాలేదు. ఫిబ్రవరిలోనే ఎండలు మండుతున్నాయి. మిట్ట మధ్యాహ్నం ఇళ్లలో ఉండాలన్నా.. వీధుల్లో తిరగాలన్నా ఉక్కపోత ఓ వైపు.. ఎండవేడిమి మరోవైపు జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నగరం సమీపంలోనే పేదవాడి స్విమ్మింగ్ పూల్‌ను తలపించేలా హెచ్చెల్సీ ఉంది. సమీపంలోని కాలనీవాసులు, యువకులు సరదాగా ఈతకొడుతూ ఉపశమనం పొందుతున్నారు. బైపాస్ పక్కన, నాగిరెడ్డిపల్లి, ఇంద్రానగర్, పాతూరు వరకు ఇలా.. కాలువలో నీరు ఉండడంతో మధ్యాహ్నం పూట ఇలా గడుపుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం